## 2024 మే 7 - అల్లూరి సీతారామరాజు శతవర్ధంతి

# మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజుకు అరుణారుణ జోహార్లు



**అల్లూరి** సీతారామరాజు 1897 జులై 4న విశాఖ జిల్లా, పాండ్రంగిలో జన్మించాడు. ఇబ్బందుల నడుమ సాగిన ప్రాథమిక విద్యాభ్యాస అనంతరం, విశాఖ ఏవిఎన్ విద్యాలయంలో చదువుతుండగా 1908 సం॥లో తండ్రి హటాన్మరణంతో, కాకినాడ పినతండ్రి వద్దకు ఆయన మకాం మార్చవలసి వచ్చింది. చదువు మీద అంతగా ఆసక్తి కనబరచని సీతారామరాజు, ప్రకృతి పరిశీలనలో, ప్రజల బాధల గురించిన ఆవేదనతో అంతర్ముఖంగా వుండేవాడు. తండ్రి నుండి అందిన జాతీయ భావాలు చిన్నతనంలో రామరాజుపై మంచి ప్రభావం కల్గించాయి.

1913-18 కాలంలో సీతారామరాజు తుని ప్రాంతంలో కృష్ణదేవిపేట, ధార పర్వతాలలో, సమీప గ్రామాలలో మన్యం ప్రజలకు చేరువై, వారి కష్టసుఖాలలో భాగం పంచుకుంటూ వారితో స్థానికంగా పంచాయితీల ద్వారా వారి సమస్యలను పరిష్కరించే క్రమంలో వారి నాయకునిగా ముందుకొచ్చాడు. బ్రిటిష్ పాలకుల కుట్రలను తిప్పిగొట్టి, వేర్వేరు తెగలను ఏకం చేశాడు. ఆయా గ్రామాల ప్రజలందరితో సమావేశాలు జరిపి వారిని కూడగట్టాడు. దేశవ్యాపితంగా పర్యటించి అనేకమంది జాతీయోద్యమ నాయకులతో పరిచయాలు పెంచుకోవటంతో పాటు, బ్రిటిష్ దుర్మార్గ పాలన గురించిన అవగాహనను విస్తృతం చేసుకున్నాడు. ఈ క్రమంలోనే పోరాటయోధులైన గాం గంటందొర, గాం మల్లుదొరలు తోడయ్యారు. తుపాకి పేల్చడంలో ఆదివాసీ యువకులకు శిక్షణనిచ్చి గెరిల్లా పోరాట ఎత్తుగడలను అనుసరించాడు. ఈ విధమైన సన్నాహకాలతో సీతారామరాజు 1920-22 మధ్యకాలంలో రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసుల తిరుగుబాటుకు నాయకత్వం వహించి నడిపించాడు.

బ్రిటిష్ పాలకుల దోపిడీ దుర్మార్గాలను నిరసిస్తూ దేశ వ్యాపితంగా ఎన్నో పోరాటాలూ, తిరుగుబాట్లు జరిగాయి. 1878-80ల మధ్య కాలంలో ద్వారబంధాల రామచంద్రయ్య తదితరుల నాయకత్వంలో మన్యం ప్రాంతంలో మొదటి రంప పితూరీ సాయుధంగా, హింసాత్మకంగా సాగింది. దానిని బ్రిటిష్ పాలకులు అణచివేసినప్పటికీ, ఆదివాసుల అసంతృప్తి అనేక ఆందోళనలుగా తదనంతర కాలంలోనూ ఆగకుండా పెల్లుబుకుతున్న పరిస్థితులలో, ఆదివాసులకు కనీస రక్షణ కల్పించకుంటే, తమ విశాల దోపిడీ ప్రయోజనాలు దెబ్బతింటాయని బ్రిటిష్ పాలకులు భావించారు. తమ పాలన సజావుగా ఎక్కువకాలం సాగటం కష్టతరమవుతుందని గ్రహించి, 'ఏజెన్సీ ప్రాంత ప్రయోజనాలు-భూ బదిలీ చట్టం-1917'ను ముందుకు తెచ్చారు. బ్రిటీషు పాలకుల విధానాలు, వారు సాగించే కొత్త కొత్త రూపాల్లో దోపిడీ, అణచివేతలు ఆదివాసులను మరింత అసంతృప్తికి లోను చేశాయి.

మరోవైపున సమాంతరంగా దేశ వ్యాపితంగా జాతీయోద్యమం ఊపందుకుంది. ఈ నేపథ్యంలో 1922-24 సం॥ మధ్య కాలంలో సీతారామరాజు నాటి విశాఖ, తూర్పుగోదావరి జిల్లా మన్యం గిరిజనులను కూడగట్టి ఉద్యమింపజేశాడు; గెరిల్లా పోరాటం సాగించాడు. బ్రిటిష్ ప్రభుత్వ దుర్మార్గ, నిరంకుశ పాలనపై గిరిజనులు ఆగ్రహించారు. పోడు వ్యవసాయంపై ఆంక్షలు వారిని మరింత వత్తిడికి లోను చేశాయి. అటవీ సంపదను దోచుకెళ్ళటానికి అనువుగా బ్రిటిష్ ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతంలో ప్రారంభించిన రహదారులు, తంతి సౌకర్యాల వంటి నిర్మాణ పనుల్లో పాల్గొన్న ఆదివాసులకు కనీసంగా చెల్లించే కూలీ డబ్బులలోనూ లంచగొండి అధికార్లు కోత విధించటం, మహిళలపై అఘాయిత్యాలు పెచ్చుమీరాయి. అక్రమ పన్నుల భారంతో తరతరాలుగా అడవినే నమ్ముకున్న ఆదివాసులు, అడవిలోనే పరాయివారిగా మిగిలిపోవాల్సి రావటాన్ని వారు సహించలేకపోయారు. దుర్మార్గమైన అటవీ నిబంధనలు, జమీందార్ల అరాచకాలు, పోలీసుల అణచివేత, వేధింపులు, ముఠాదారీ విధానం మొదలైన వాటితో ఆదివాసులు, సీతారామరాజు నాయకత్వంలో పోరాటానికి సిద్ధమయ్యారు. అయితే కేవలం విల్లంబులతోనే సాయుధ పోలీసులను ఎదిరించి నిలవటం సాధ్యంకాదని, తాము కూడా తప్పనిసరిగా తుపాకులు, మందుగుండు సామాగ్రిని సమకూర్చుకోవాలని నిర్ణయించుకొని,

చింతపల్లి, కృష్ణదేవిపేట, రాజవొమ్మంగి పోలీస్‌స్టేషన్లపై దాడి సాగించారు.

స్కాట్, హైటర్ వంటి ప్రపంచ యుద్ధాలలో ఆరితేరిన సైనికాధికారుల నాయకత్వంలో 300 మంది ప్రత్యేక సాయుధ బలగం మన్యాన్ని జల్లెడపట్టింది. దామనిపల్లె వద్ద స్కాట్, హైటర్ బలగాలకూ, రామరాజు నాయకత్వంలోని ఉద్యమకారులకు నడుమ సాగిన గెరిల్లా యుద్ధంలో బ్రిటిష్ పోలీసు అధికారులిద్దరూ అక్కడికక్కడే మరణించారు. కొద్దిమందిగా వున్న ఉద్యమకారుల బృందం ఏ గ్రామం వెళ్ళినా అక్కడి ప్రజలంతా సైన్యమై వీరికి వెన్నంటి నడిచారు.

అయితే, బ్రిటిష్ పోలీసు బలగాల సంఖ్య, వారి అధునాతన ఆయుధ శక్తి ముందు.... కొద్ది ప్రాంతానికే పరిమితమైన ఉద్యమం, బయట మైదాన ప్రాంతాల నుండి ఎటువంటి తోడ్పాటు, సహాయాలు లేకపోవటంతో,.... ఎక్కువ కాలం మనలేకపోయింది. మరోవైపున 1924 జనవరి 27న మేజర్ గూడాల్ నాయకత్వంలో అస్సాం రైఫిల్ దళాన్ని ప్రత్యేకంగా రంగంలోకి దించారు. కన్నెగంటి హనుమంతును కాల్చి చంపించిన ఐసిఎస్ అధికారి రూదర్ ఫర్డ్‌ను రామరాజును అంతమొందించేందుకు ఏజెన్సీలో పోలీసు చర్యకు ప్రత్యేక కమీషనర్‌గా నియమించారు.

ఎట్టకేలకు, 1924 మే 7వ తేదీన మాటుగాసి సజీవంగా రామరాజును బంధించిన పోలీసులు, ఆలస్యం చేయకుండా అదేరోజు కొయ్యూరు సమీపంలోని ఓ చెట్టుకు కట్టివేసి, కాల్పులు జరిపి ఆయనను హత్య గావించారు. తప్పించుకునే ప్రయత్నంజేస్తే కాల్చి చంపవలసి వచ్చిందని బ్రిటిష్ ప్రభుత్వం అబద్ధపు ప్రచారాలు చేసుకుంది. దేశవ్యాపిత విప్లవకారులందరితో సీతారామరాజు సమన్వయ కృషిలో వుండి, వారందరితో సన్నిహిత సంబంధాలను నెరపుతూ, ఉద్యమాన్ని విస్తృతపరిచే ఆలోచనలో వున్నప్పటికీ – అవేవీ కార్యరూపం దాల్చనీయకుండా బ్రిటిష్ ముష్కరులు 27 సంవత్సరాల వయసులోనే ఆయనను అంతమొందించారు. విశాఖ, తూర్పుగోదావరి జిల్లాలలో 186 ఏజెన్సీ గ్రామాలు ఆయన నాయకత్వంలో ఈ ఉద్యమం వెంట నడిచాయి; ఈ ఉద్యమ క్రమంలో 276 మంది ఉద్యమకారులపై, గిరిజనులపై బ్రిటిష్ ప్రభుత్వం అనేక అక్రమ కేసులు నమోదు చేసింది; అనేకమందిని జైలుశిక్షలకు గురిచేసింది.

అల్లూరి సీతారామరాజును 'భౌతికంగా' బ్రిటిష్ ప్రభుత్వం అంతం చేయగలిగింది. కానీ, వంద సం॥లు అయినా ఆయన స్ఫూర్తి, ఆయన పోరాట తెగువ ఆదివాసుల, ఆంధ్ర రాష్ట్ర ప్రజానీకం గుండెల్లో నిలిచే వున్నాయి. సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా ఆదివాసులపై దోపిడీ పీడనలను నిరసిస్తూ అల్లూరి సీతారామరాజు ప్రదర్శించిన పోరాట స్ఫూర్తిని, ముఖ్యంగా ఆదివాసుల సమస్యల పరిష్కారానికి, వారి స్వేచ్ఛా జీవనంపట్ల ఆయన అంకితభావం, త్యాగనిరతి వంటి లక్షణాల నన్నింటినీ పుణికి పుచ్చుకొని ఆదివాసీ, రైతు, కూలీ ప్రజానీకం ఉద్యమించటమే ఆ విప్లవ వీరునికి మనమర్పించే అసలైన నివాళి. దేశప్రజలంతా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో జీవించాలనే సీతారామరాజు కలను సాకారం చేసేందుకు ఆయన శతవర్ధంతి సందర్భంగా ప్రతినబూనుదాం.

★★★★★